# కళ్ళు

ఆ ఇంటి ముందు వాతావరణం గంభీరంగా ఉంది. ఎంతోమంది జనం అక్కడ ఉన్నా కోలాహలంగా లేదు. అందరి ముఖాల్లోనూ విషాదం అలుముకుని ఉంది. ఎవరేనా మాట్లాడినా నెమ్మదిగా గుసగుసగా మాట్లాడుతున్నారు.

చనిపోయిన పరాంకుశం శవాన్ని పది నిమిషాల క్రితమే ఇంటికి తీసుకొచ్చారు. మంచు పలక అమర్చిన, ఎత్తైన బల్లమీద శవాన్ని అందరికీ కనిపించేలా ఉంచారు.

నటుడు, రాజకీయ నాయకుడూ అయిన పరాంకుశం పోయాడన్న వార్త క్షణాల మీద అందరికీ తెలిసిపోయింది. కార్లూ, స్కూటర్లు ఇంటి చుట్టూ చేరిపోయాయి. ఎక్కడెక్కడి మనుషులూ గుంపులుగా వచ్చి గేటు దగ్గర చేరి మునివేళ్ళ మీద లేస్తూ మెడలు చాచి లోపలికి చూస్తున్నారు.

ఏనుగు తొండంలాంటి పూలదండ అతని మెడనలంకరించి ఉంది. ఎందరెందరో వస్తూ అతని పాదాల చెంత, గుండెల మీద పుష్పగుచ్ఛాలు, దండలూ ఉంచుతున్నారు.

శవానికి కాస్త దూరంగా తలవైపున రాజేశ్వరీ దేవి కూర్చుని ఉంది. తలవంచుకుని కూర్చున్న ఆమె తలమీంచి కొంగు నుదుటి మీదకి జారి కళ్ళ వరకు కప్పేసి ఉంది. ఆమె మూసిన కనురెప్పల వెనుక ఏముందో ఎవరికీ తెలీదు.

''ఆమె ఎప్పుడూ నిండుకుండే. తొణకదు బెణకదు. హుందాతనం, దర్జా ఆమె సొత్తు'' ఎవరో అతిమెత్తగా గాలిలో తేలివచ్చిన గరగరలాగా అంటున్నారు.

ఆ మాటలు రాజేశ్వరీ దేవి చెవుల్లో పడ్డాయో, లేదోగానీ, ఆమెలో పెద్దగా స్పందనేమీ లేదు. కొన్ని క్షణాల తర్వాత మళ్లీ మాటలు...

''ఏం నటుడండీ... ఏం నటనండీ. ఆయనకాయనే సాటి''

''కళ్ళలో ఉండేవి అన్ని భావాలూను'' –

''అవును లోకాల్ని జయించగల ఆ కళ్ళ ఆకర్షణే అతన్ని రాజకీయాల్లోనూ రాణించేలా చేసింది'' –

''మరే.... అతను ఎదుటపడి మాట్లాడితే మారుచెప్పే శక్తి ఎవ్వరికీ ఉండేది కాదు-

ఈ మాటలు చెవినపడ్డ రాజేశ్వరీ దేవిలో కదలిక – నిశ్చలాంతరంగంలో ఒక జ్ఞాపకం రాయై చెదరగొట్టిన కలకలం.

కళ్ళు – కళ్ళు

అవును. ఆ కళ్ళలో మెరుపు – ఆ కళ్ళలో చమత్కారం – ఆ కళ్ళల్లో ఆకర్షణ ఆమెకు తెలుసు. ఆమెకు అనుభవమే. ఏభై ఏళ్లనాటి దృశ్యం ఆమె మనోనేత్రంలో నెమ్మదిగా రూపుదిద్దుకుంటోంది.

ఆనాడు పెద్దనిమిదేళ్ళ చిన్నదానిగా తను పొందిన అలజడి, తను సిగ్గువిడిచి ఇంట్లో అమ్మా-నాన్నలతో మాట్లాడిన తీరూ ఇప్పటికీ కళ్ళముందు కదులుతూనే ఉంది. ఆ మాటలు చెవుల్లో వినిపిస్తూనే ఉన్నాయి.

''పిల్లాడు ఎర్రగా బుర్రగా బానే ఉన్నాడు. కాణీ సంపాదన లేదు. చదువు లేదు. నాటకాలేస్తాడు. నాటకాలు కూడూ గుడ్డా పెడతాయా'' నాన్నమాటలవి.

''రాజీకి బాగా నచ్చాడు'' అంది తల్లి సన్నగా.

''నాటకాలేసేవాడు నచ్చకేం చేస్తాడు? దీనికేనేంటే, ఊళ్ళో ఆడోళ్ళందరికీ నచ్చుతాడు''

''అయ్యన్నీ మనకెందుకు, ఇష్టముంటే యివ్వడం లేకుంటే కాదనడం'' తుం చేసింది తల్లి.

''మనోళ్ళలో పట్టుమని పదెకరాలు లేకపోతే ఏం పరువూ.. ఏమో నాకిష్టం లేదు'' తండ్రి తేల్చేశాడు. అది ఏడుపు ముగమేసుక్కూర్చుంది'' తన వైపు తల్లి మాట. ''ఏం? నా వాటా పదిహేను ఎకరాలు నాకున్నాయిగా అతనికి లేకుంటేనేం?'' రాజేశ్వరీదేవి తన ధైర్యానికి తనే కంగారుపడింది.

తండ్రి కూతురువంక ఆశ్చర్యంగా చూశాడు. ''నాటకాల వాళ్ళంటే నాకు నమ్మకం లేదు. అయినా ఆడితో బతకాల్సిన దానివి నీకు నచ్చితే నాకేంటి, వెళ్లి మాట్లాడుతాలే'' అన్నాడు ఒప్పుకుంటూ.

★ ★ ★ ★

ఎవరో వచ్చి రాజేశ్వరీ దేవి పక్కన కూర్చున్నారు. ఆమె చెయ్యి తన చేతిలోకి తీసుకుని

''ఇంతలో ఇలా జరుగుతుందనుకోలేదు'' అందామె రాజేశ్వరి ఆమె వైపు నిదానంగా చూసింది. మరీ స్నేహం లేకపోయినా పరిచయం ఉన్న మనిషే. రాజేశ్వరి కళ్ళల్లో కన్నీళ్ళు కనిపించకపోయేసరికి ఆమె ఒక్క క్షణం బిత్తరపోయి, వెంటనే సర్దుకుని తనే కళ్ల నీళ్లెట్టుకుని జాలిగా చూసింది.

రాజేశ్వరీ దేవి గతం, భర్త వర్తమానాల మధ్య ఊగిసలాడుతోంది.

కళ్ళు - కళ్లల్లో నీళ్ళు -

చారడేసి కళ్ళు ఉన్నా - చింతాకుల్లాంటి చీకిరి కళ్ళే ఉన్నా కడవలుగా కురిసే కన్నీళ్ళకా భేదం లేదు.

అప్పుడే అక్కడ అడుగుపెట్టిన డాక్టర్ ప్రసాద్ రాజేశ్వరీ దేవికి నమస్కరించి ఏదో చెప్పబోయేతంలో బయట కలకలం చెలరేగింది.

పెద్దగా ఏడుస్తూ ఒకామె దూసుకొచ్చింది. అందరూ ఆశ్చర్యంగా, ఇబ్బందిగా చూస్తూండిపోయారు. ఆమె సరాసరి శవం దగ్గరకెళ్ళి శోకాలు మొదలుపెట్టింది. రాజేశ్వరి కళ్ళల్లో అరుణిమలు అలుముకున్నాయి. తనలోని కోపం ఎదుటివారికి కనిపించకూడదని కళ్ళు గట్టిగా మూసుకుంది.

ఆ వచ్చిన శమంతకమణి శవాన్ని చుట్టేసి పెద్ద పెట్టున రాగాలు మొదలు పెట్టింది.

''నిన్నటి రోజున కూడా నాతో వేళాకోళం ఆడాడు నా సామి. ఇంతలోనే ముంచుకొచ్చిందా చావు.. కన్నుగీటుతూ నీకు మంత్రి పదవిస్తాన్నాడే - నాదొర - అప్పుడే ఆ కళ్ళు మూతలు పడ్డాయా - ఆకాశమంత విశాలమైన కళ్ళల్లో నా ముఖం చూసుకుని బొట్టుపెట్టుకునే దాన్నిరో - నా దేవుడ్ని తీసుకుపోయి, నాకు బొట్టే లేకుండా చేశావా - దేవుడా !

అందరూ అవాక్కయిపోయారు. డ్రామా చూస్తున్నట్టు చూస్తూండిపోయారు.

రాజేశ్వరి కళ్ళు అవమానభారంతో వాలిపోయాయి. పెద్దమనుషులు ముందు కొచ్చారు. పరాంకుశం ఇద్దరు కొడుకులు కల్పించుకున్నారు. అరగంట అవస్థపడ్డాక ఆమెని దూరంగా తీసుకెళ్ళగలిగారు.

డాక్టర్ ప్రసాద్ మళ్లీ అసహనంగా అటూ ఇటూ చూశాడు. అతను చెప్దామను కున్న సంగతి అతని కళ్ళల్లో ప్రశ్నిగానే ఉండిపోయింది కాస్సేపు.

ప్రసాద్ పరాంకుశం పెద్దకొడుకు దగ్గర కెళ్ళాడు. ''చూడు బాబు, నాన్నగారు చాలా గొప్పవారు.

''అవునండి''

''పేద ప్రజల మనిషి... అందర్నీ కన్నబిడ్డల్లా చూసుకునేవారు.

''నిజమేనండి''

తన మరణానంతరం కళ్ళు డొనేట్ చేస్తానని చెప్పారు.

అవిప్పుడు....''

అతనేదో షాక్ తిన్నట్లు 'అబ్బే ! నాన్నగారిలాంటి గొప్ప వ్యక్తి, కళాకారుడు- ప్రజానాయకుడు అంగవైకల్యంతో అంత్యక్రియలూ - ఛా ఛా ''కూడదండీ''

అదికాదు బాబు ! ఇది ఆయన కోరికే - ప్రపంచంలో ఉన్న గుడ్డివారిలో ప్రతీ మూడోవాడూ ఇండియన్ నీకు తెలుసా''

''తెలీదు. తెలిసినా ఇప్పుడు నేనేం చెయ్యలేను. మా నాన్నగారి లాంటి మహా వ్యక్తి కళ్ళు తీయడానికి నేనొప్పుకోను''

కళ్ళు దానం చెయ్యడం వల్ల ఆయన మహోన్నత వ్యక్తి అవుతారు. బతికుండగానే కాక, చనిపోయాక కూడా సాటిమనిషికి సేవ చేసిన చరిత్ర పురుషుడవుతాడు. సమయం లేదు మీరు...''

''డాక్టర్‌గారూ ! మీరేమనుకోకండి... నే నొప్పుకోలేను''.

ఇంతలో రెండో కొడుకు వచ్చాడు. మళ్లీ అంతా వివరంగా చెప్పాడు డాక్టరు ప్రసాద్ అతను మరింత విసురుగా''నో.. నో.. మా నాన్నగారు గొప్ప నటులు.. ఆయన అభిమానులకు ఆ కళ్ళంటనే ప్రాణం- అవి మూతలు పడినా వారి హృదయాల్లో చిర స్థాయిగా నిలిచిపోయి ఉన్నాయి. దయచేసి ఆ ముద్ర చెరపవద్దు''

ప్రసాద్ మరేం మాట్లాడలేక పోయాడు-,

ఇంతలో ఒకామె నెమ్మదిగా కాస్త వయ్యారంగా, కాస్త బిడియంగా, దుఃఖాభినయంతో శవం దగ్గరికి వచ్చి పాదాలకి నమస్కరించి, తల పాదాలవైపుంచి, దుఃఖించి కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయింది. ఆమె పరాంకుశం సినీ నట జీవిత భాగస్వామి. ఆమె కిరువైపులా ఇద్దరు బాడీగార్డులున్నారు. ఆమె రావడం, వెళ్ళడం కన్ను మూసి తెరిచేలోగా అయిపోయింది. అందరూ కళ్ళప్పగించి చూస్తూండిపోయారు.

రాజేశ్వరీదేవి కళ్ళు శరత్ కాలపు మేఘాల్లా నీరెండి నిర్మలంగా ఉన్నాయి.

మళ్ళీ ఎవరో అన్నారు ''కళ్ళల్లో తడి కూడా ఎవ్వరూ కనిపెట్టలేకుండా ఆ పెద్దావిడ్ని చూడండి ఎంత నిబ్బరంగా ఉందో'' ఆ మాటలామెకు వినబడ్డాయి. కళ్ళల్లో తడి ఆరిపోయి నలభై ఏళ్ళయింది. పెళ్ళయిన రెండేళ్ళూ నానా ఇబ్బందీ పడినా చిరునవ్వులతోనే ప్రేమను పంచి ఇచ్చింది. భర్త కళ్ళల్లో మెరిసే సిరులే సింగారించుకుని తిరిగింది – కానీ అంతలోనే అన్నీ మారాయి. పరాంకుశం దశ తిరిగింది. సినిమా నటుడిగా ఏడాదిలో లక్షలు గడించాడు. ఎక్కడ చూసినా, అతని బొమ్మలే, ఆకర్షవంతమైన అతని కళ్ళే – అందరూ రాజేశ్వరీ దేవి అదృష్టమే అన్నారు–, 'నా రెండు కళ్ళూ నీవే' అన్న అతను మరొకామెని చేరదీసి మీ ఇద్దరూ నాకు రెండు కళ్ళు అన్నాడు–,

రాజేశ్వరి మనసూ, కళ్ళూ అప్పుడే తెరుచుకున్నాయి..., ఆరోజు రాత్రే అతని రెండు కళ్ళు పీకి పారేయాలనుకుంది. తన కంటికి మింటిగా ఏడ్చింది. ఆ తర్వాత కంట తడి పెట్టలేదు.

గడ్డికప్పిన నూతుల్లాంటి ఆ కళ్ళని మరెప్పుడూ ఆరాధించలేదు. కాంక్షా సర్పద్వయ మైన ఆ కళ్ళవైపు కాంక్షగా మరెప్పుడు చూడలేదు. 'అహం' అనే రెండు అక్షరాల్లా మెరిసే ఆ కళ్లను చదివేందుకు ఎప్పుడూ ప్రయత్నించలేదు.

ఆమె పరాంకుశం భార్య హోదాలో మిగిలిపోయింది. తనని మోసగించిన ఆ రెండు కళ్ళూ అంటే ఆమెకి కసి వాటిని పీకి పారేయాలన్నంత క్రోధం, చివరి ప్రయత్నంగా డాక్టరు ప్రసాద్ రాజేశ్వరి దేవి దగ్గరకొచ్చాడు. నెమ్మదిగా, మృదువుగా అంతా వివరించాడు.

ఆమె ఒక్కసారి కళ్ళెత్తి చూసింది –

తనని మోసం చేసిన కళ్ళు పీకి పారేయాల్సిందే, కానీ – కానీ రాజేశ్వరి మనిషిగా

ఒక్క క్షణం కళ్ళు తెరిచింది. అవును ఆ కళ్ళు నిజంగా సద్వినియోగపడేది ఇప్పుడే - లోకం చూడలేని గుడ్డి వాడికి దృష్టినిచ్చే మహాత్కార్యం చేయగలిగేది ఈ తరుణంలోనే-

ఆమెలోని కసి క్రమంగా కరుణగా మారింది -, అతను తన పట్ల ప్రదర్శించిన నిర్లక్ష్యానికి తను ఆతనికి సద్గతినే ఇస్తోంది.

ప్రసాదూ ! మీ పని మీరు చేయండి. ఆ కళ్ళు మరొకరికి దృష్టి నివ్వడమే కావాలి'' అంది.

శమంతకమణి మళ్లీ రాగాలు మొదలు పెట్టింది.

''ఆ కళ్ళల్లోనే గూడు కట్టుకుని జీవించాను నాయనో నా ఎదురుగా ఆ కళ్ళు తీయకండిరో నాయనల్లారా'' రాజేశ్వరీ దేవి మాట ముందు శమంతకమణి గోల ఎవ్వరూ పట్టించుకోలేదు-, ఆమె రాగాలు వింటున్న కొడుకులిద్దరూ తల్లి మాటనే సమర్థించారు.

డాక్టర్ ప్రసాద్ చకచకా తన పని ముగించి, కళ్ల థర్మాస్‌బాక్స్‌లో పెట్టుకున్నాడు.

చాలా ఏళ్ల తర్వాత రాజేశ్వరీ దేవి కళ్ళల్లో కన్నీటిపొర కమ్ముకుంది.

ఆదివారం ఆంధ్రప్రభ దినపత్రిక

25-5-1997